## ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు



ఆలయం ఎదుట పట్నం

**జనగామ టౌన్, న్యూస్‌టుడే:** జనగామ పట్టణంలోని బతుకమ్మకుంట మైదానంలో ఉన్న దుర్గామాత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ఎల్లమ్మ తల్లి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎల్లమ్మ తల్లి ఆలయం ఎదుట పూజారులు పట్నం వేశారు. మహిళలు బోనాలు సమర్పించారు. దుర్గామాత దేవాలయంలో రెండో రోజు అరాధ్యశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. దేదీప్యమానంగా కుంట ప్రాంగణంలోని దుర్గామాత, ఎల్లమ్మ దేవాలయాలు విద్యుత్ దీపాలతో అలంకరించారు. రెండో రోజు వేలాది సంఖ్యలో ప్రజలు తరలివచ్చి తల్లులను దర్శించుకున్నారు.

## ట్రాన్స్‌కో డీఈగా రాంబాబు

**స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే:** స్టేషన్‌ఘన్‌పూర్ ట్రాన్స్‌కో (విద్యుత్తు) డీఈగా వై.రాంబాబు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డీఈగా పని చేసిన మాలోతు హుస్సేన్ నాయక్ అవినీతి నిరోధక శాఖకు పట్టుపడటంతో తొలగించారు. ఆయన స్థానంలో జనగామలో టెక్నికల్ డీఈగా పని చేస్తున్న గడ్డం గణేశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇటీవల ప్రభుత్వం విద్యుత్తు శాఖలో బదిలీలు చేపట్టడంతో హనుమకొండ కార్పొరేట్ కార్యాలయంలో పని చేసిన రాంబాబు ఇక్కడికి బదిలీపై వచ్చారు.

# మిల్లర్ల సీఎంఆర్ మాయాజాలం!

జనగామ టౌన్, న్యూస్‌టుడే

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి తిరిగి అప్పగించేందుకు ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా రైస్‌మిల్లులకు ధాన్యాన్ని సరఫరా చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇచ్చిన ధాన్యాన్ని కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్) కింద తిరిగి మిల్లర్లు బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ క్రమంలో గత, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కూడా మిల్లర్లు అప్పగించే విషయంలో అవకతవకలకు పాల్పడుతున్నారు. జిల్లా కలెక్టర్ నుంచి మొదలుకొని రెవెన్యూ అదనపు కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు నిత్యం సమీక్షిస్తూ సీఎంఆర్ గడువులోగా ఇవ్వాలనే నిబంధనలు విధిస్తున్నా పలు మిల్లుల యజమానులు ఇదేం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఓ రైస్‌మిల్లులో నిల్వ ఉంచిన ధాన్యం

| | |
|---|---|
| జిల్లాలో ఖరీఫ్‌లో సీఎంఆర్ ఇచ్చిన మిల్లులు | : 58 |
| సరఫరా చేసిన ధాన్యం | : 80,864,240 మెట్రిక్ టన్నులు |
| సరఫరా చేసిన సీఎంఆర్ బియ్యం | : 46,089,182 ,, |
| పెండింగ్‌లో ఉన్న బియ్యం | : 54,273,889 ,, |
| రబీలో సరఫరా చేసిన ధాన్యం | : 1,42,806 ,, |
| ఇచ్చిన బియ్యం | : 57,864 ,, |

### రొటేషన్ పద్ధతి పాటిస్తూ.. అక్రమాలకు తెరదీస్తూ..

జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున సీఎంఆర్ బియ్యం పెండింగ్‌లో ఉంచే రైస్‌మిల్లర్లు ఒక సీజన్‌లో తమకు సరఫరా చేసిన ధాన్యాన్ని సొంత అవసరాలకు వినియోగించుకుంటూ అక్రమాలకు తెరదీస్తున్నారు. మరో సీజన్ ధాన్యం సరఫరా అయ్యే వరకు తిరిగి అదే రీతిన మొదటి సీజన్ పెండింగ్‌లో ఉంచుకుంటూ ప్రభుత్వానికి నత్తనడకన పంపిణీ చేస్తున్నారు. ఈ లెక్కన ఓ సీజన్ ధాన్యం మొత్తం ప్రతి ఏడాది మిల్లర్ల వద్దనే ఉంటున్నట్లు అధికారుల విచారణలో తేలింది. దీనికి తాజా ఉదాహరణ దేవరుప్పుల మండల పరిధిలోని ఓ మిల్లులో రూ.5.67కోట్ల విలువైన సీఎంఆర్ ధాన్యం మాయమైనట్లు అధికారుల తనిఖీలో వెలుగు చూడటమే. దీంతో సదరు మిల్లు యజమానిపై అధికారులు క్రిమినల్ కేసు నమోదు చేసి ఆస్తులు జప్తునకు నిర్ణయించారు. దశాబ్దాలుగా ప్రభుత్వ ధాన్యాన్ని భారీగా కొల్లగొడుతూ, రొటేషన్ దందా సాగిస్తున్న వారిపై అధికార యంత్రాంగం ప్రత్యేక కఠిన చర్యలు చేపట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఏ సీజన్‌లో సరఫరా చేసే ప్రక్రియ ఆ సమయంలోనే ముగిసేలా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ప్రజల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### బియ్యం సరఫరాలో నిర్లక్ష్యం..

జిల్లా వ్యాప్తంగా గత వానాకాలంలో సీఎంఆర్ ధాన్యం మిల్లర్లకు ఇచ్చిన లక్ష్యాన్ని ఇంకా పూర్తి చేయలేదు. జిల్లా వ్యాప్తంగా 54 రైస్‌మిల్లులకు సీఎంఆర్ ధాన్యాన్ని ప్రభుత్వం కేటాయించింది. అయితే రబీ సీజన్ ప్రారంభం అయినా కూడా గత వానాకాలం సీజన్‌లో ఇచ్చిన ధాన్యం కేవలం సగం మాత్రమే మిల్లర్లు సరఫరా చేయడంతో అధికార వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా, చలనం కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఖిలాషాపూర్, స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, ఓబుల్‌కేశ్వాపూర్, జఫర్‌గఢ్, కంచనపల్లి, కన్నెబోయినగూడెం, కుందారం తదితర ప్రాంతాల్లోని పలు రైస్‌మిల్లులు పెద్ద ఎత్తున బియ్యాన్ని సరఫరా చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని పౌరసరఫరాల శాఖ అధికారుల తనిఖీల్లో వెల్లడైంది.




### గడువులోగా అందించాలని ఆదేశించాం..

**- హథీరామ్, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్**



జిల్లా వ్యాప్తంగా దీర్ఘకాలంగా సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్న రైస్‌మిల్లులపై కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు జరిపి, రికవరీ చేయబోతున్నాం. గడువులోగా ఇవ్వాలని మిల్లర్లకు తగిన ఆదేశాలు ఇచ్చాం. ఓ రైస్ మిల్లు నిర్వాహకుడిపై ఇటీవల కేసు నమోదు చేశాం. ఇకపై నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

# చెక్‌డ్యాంల కళకళ.. సాగు భళా



పరవళ్లు తొక్కుతున్న కోనాయచలం చెక్‌డ్యాం

**జఫర్‌గఢ్ :** మండల పరిధిలోని వాగులపై చెక్‌డ్యాంలు నిర్మించడంతో పంట పొలాలు కళకళలాడుతున్నాయి. ఉప్పుగల్లు, తమ్మడపల్లి(ఐ), కూనూర్, కోనాయచలం, తిడుగు గ్రామాలను కొన్నేళ్ల క్రితం 'కరవు' ప్రాంతంగా ప్రభుత్వం గుర్తించి ఈ గ్రామాల్లో బోర్లు, బావుల తవ్వకాలు జరపవద్దని ఉత్తర్వులు జారీ చేసింది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవతో ఉప్పుగల్లు, కోనాయచలంలో చెక్‌డ్యాంలను రూ.కోటి నిధులతో చేపట్టారు. తిడుగులో భారాస ప్రభుత్వ హయంలో రూ.4 కోట్లతో మూడేళ్ల క్రితం మరో చెక్‌డ్యాం నిర్మించారు. వర్షాలు సరిగా కురవకపోవడంతో వాగులు పారక రైతులు నీళ్ల కోసం భగీరథ ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. వాగులోని ఇసుకను భారీగా తరలించడంతో చుక్కనీరు లేకుండా పోయాయి. అనంతరం ఉప్పుగల్లు ఆకేరు వాగుపై 0.5 టీఎంసీల సామర్థ్యంతో జలాశయాన్ని నిర్మించారు. నిర్మాణం పూర్తికావడంతో నీళ్లు నిండుగా ఉంటూ మత్తడి నీళ్లు ఆకేరు వాగు నుంచి నిరంతరంగా పారడంతో ఉప్పుగల్లు, కోనాయచలం, తిడుగు చెక్‌డ్యాంలు నిత్యం జలకళతో కనిపిస్తున్నాయి. వీటి కింద దాదాపు 1500 ఎకరాల వరి పంట సాగు చేస్తున్నారు. రఘునాథపల్లి, ఉప్పుగల్లు, కూనూర్, గర్మిళ్లపల్లి, తిడుగు, కోనాయచలం రైతుల బారు బావుల్లో భూగర్భ జలమట్టం పెరగడంతో రెండు పంటలకు సరిపడా నీళ్లు అందుతున్నాయి..



చెక్‌డ్యాంల పరిసర ప్రాంతాల్లో సాగు చేసిన వరి



## రైల్వే స్టేషన్‌లో నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు

**కాజీపేట టౌన్, న్యూస్‌టుడే:** పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు యాంటీ డ్రగ్స్ బృందం, కాజీపేట పోలీసులు సంయుక్తంగా కాజీపేట రైల్వే స్టేషన్‌లో మంగళవారం రాత్రి నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్లు జె.సురేష్, వై.సుధాకర్‌రెడ్డి, ఆర్ఐ శివకేశవులు, ఎస్సైలతో కలిసి సోదా చేశారు. ఎవరైనా గంజాయి తాగినా, విక్రయాలు చేస్తూ కనిపించినా 8712584473 నెంబరుకు ఫోన్ చేయాలని ప్రయాణికులకు సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, తగిన పారితోషికాన్ని అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు నవీన్‌కుమార్, లవన్‌కుమార్ పాల్గొన్నారు.



## చిల్పూర్‌లో ప్రత్యేక పూజలు


**చిల్పూర్, న్యూస్‌టుడే:** చిల్పూర్‌లోని శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి అష్టాదళ పద్మారాధన పూజ కార్యక్రమాన్ని మంగళవారం భక్తులు నిర్వహించారు. దేవస్థాన మాజీ ఛైర్మన్ ఆలయ శాశ్వత దాతలు పొట్లపల్లి శ్రీధర్‌రావు, కిరణ్మయి పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి మోహన్‌బాబు, మోహన్, అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచారి పాల్గొన్నారు.

## 17, 18న కళా ఉత్సవ్ పోటీలు

**జనగామ అర్బన్, న్యూస్‌టుడే:** విద్యార్థుల్లోని వివిధ కళా నైపుణ్యాల ప్రతిభను వెలికితీసేందుకు గాను ఈ నెల 17, 18 తేదీల్లో జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.రాము మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్సీఈఆర్టీ(దిల్లీ), రాష్ట్ర విద్యాశాఖ, సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలను జిల్లా కేంద్రంలోని ఏకశిలా బీఈడీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్వర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్యకళ, సంప్రదాయ కథలు చెప్పడం వంటి తదితర అంశాలపై కళా ఉత్సవ్ పోటీలు, ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. జిల్లాలోని తొమ్మిది నుంచి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని వివరించారు.

# ఆర్టీసీ పండగ చేసుకుంది..!

### ●14 రోజుల్లో రూ.28.99 కోట్ల ఆదాయం




దసరా ఆర్టీసీకి కలిసొచ్చింది. పెద్ద ఎత్తున ప్రయాణికులను చేరవేసి అదనపు ఆదాయాన్ని సంపాదించుకుంది. గతంలో పండగ సమయంలో ప్రత్యేక ఛార్జీలు వసూలు చేసేవారు. ఈసారి హైదరాబాద్ రూట్‌లో మాత్రమే ప్రత్యేక ఛార్జీలు పెట్టారు. అయినప్పటికీ అంచనా ప్రకారం అనుకున్న ఆదాయం రాబట్టింది. అక్టోబర్ 2 నుంచి పాఠశాలలు, 4 నుంచి కళాశాలలకు సెలవులు ప్రకటించడం, మహాలక్ష్మి పథకం అమల్లోకి రావడంతో మహిళలు ఉచిత ప్రయాణం చేయడం లాంటి కారణాలతో అనుకున్న లక్ష్యం చేరుకుంది..

- ● వరంగల్ రీజియన్‌లో వరంగల్ 1, వరంగల్ 2, హనుమకొండ, భూపాలపల్లి, పరకాల, జనగామ, మహబూబాబాద్, తొర్రూరు, నర్సంపేట డిపోలు ఉన్నాయి.
- ● అక్టోబర్ 1 నుంచి 14 వరకు 850 ప్రత్యేక బస్సులు నడిపించారు.
- ● 14 రోజుల్లో 20 లక్షల నుంచి 25 లక్షల మంది ప్రయాణించారు..
- ● మొత్తం 50 లక్షల కిలో మీటర్లు తిరిగి రూ.28.99 కోట్ల ఆదాయం సంపాదించారు. గతేడాది 13 రోజుల్లో రూ.19 కోట్ల ఆదాయమే వచ్చింది.

హనుమకొండ ప్రధాన బస్టాండులో ప్రయాణికుల రద్దీ

### దూర ప్రాంతాలకు

రీజియన్‌లోని వివిధ డిపోల నుంచి హైదరాబాద్, బెంగళూరు, పుణె, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్ తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపించారు. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని ఎక్కువగా వినియోగించుకున్నారు. పండగకు ముందు మూడు రోజులు, తర్వాత రెండు రోజులు అంతర్రాష్ట్ర సర్వీసుల్లో ఎక్కువ మంది ప్రయాణించారు.

### అధికారుల ప్రత్యేక దృష్టి

తిరుగు ప్రయాణంలో భాగంగా ఈ నెల 13, 14 తేదీల్లో ఆర్టీసీ రీజియన్ అధికారులు హైదరాబాద్, ఉప్పల్ ప్రాంతాల్లో ఉండి రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించారు. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన బస్ స్టేషన్లలో డిపో మేనేజర్లు పర్యవేక్షించారు.

### డిపోల వారీగా వివరాలు

| ● డిపో | ● ఆదాయం(రూ.కోట్లలో) | ● తిరిగిన కి.మీ(లక్షల్లో) | ● ఓ.ఆర్ (శాతం) |
|---|---|---|---|
| హనుమకొండ | 3.73 | 6.72 | 81 |
| జనగామ | 3.38 | 6.16 | 94 |
| వరంగల్ 1 | 4.67 | 7.82 | 83 |
| వరంగల్ 2 | 3.93 | 7.16 | 86 |
| మహబూబాబాద్ | 2.03 | 3.46 | 103 |
| నర్సంపేట | 2.84 | 4.92 | 96 |
| పరకాల | 2.23 | 3.79 | 98 |
| తొర్రూరు | 3.29 | 5.52 | 104 |
| భూపాలపల్లి | 2.85 | 4.75 | 97 |

### సిబ్బంది, అధికారుల కృషి వల్లే..

**- విజయభాను, ఆర్టీసీ రీజనల్ మేనేజర్, వరంగల్ రీజియన్**

ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాం. ఆర్టీసీ కార్మికులు, అధికారులు సమష్టి కృషి ఫలితంగా అనుకున్న మేరకు ఆదాయాన్ని తీసుకొచ్చాం. ప్రయాణికులు ఎక్కువగా ఆదరించారు. మరో రెండు రోజుల పాటు రద్దీ కొనసాగనుంది. లోటుపాట్లను సవరించుకొని సేవలు అందిస్తాం.

–హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే

## ప్రపంచ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక



పొన్న ఆదిత్య

**స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే:** గోవా రాష్ట్రంలో వచ్చే నెల 7 నుంచి 10 వరకు జరిగే ప్రపంచ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలకు జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పాముునూరు గ్రామానికి చెందిన పొన్న ఆదిత్య ఎంపికయ్యారు. పొన్న వేణు, కోమలత దంపతుల కుమారుడు ఆదిత్య ఇటీవల హనుమకొండ ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రజత పతకం సాధించారు.

## జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు..



ఎంపికైన సునీత్‌కుమార్‌తో లక్ష్య కోచ్ రంజిత్‌కుమార్

**జనగామ, న్యూస్‌టుడే:** ఈ నెల 17 నుంచి 19 వరకు గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే 35వ సౌత్‌జోన్ జాతీయ అథ్లెటిక్ పోటీల్లో జనగామ క్రీడాకారుడు జి.సునీత్‌కుమార్ పాల్గొననున్నట్లు 'ఈనాడు లక్ష్య' కోచ్ తూడి రంజిత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 19, 20లలో ఓయూలో జరిగిన తెలంగాణ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో 18 ఏళ్ల బాలుర విభాగంలో సునీత్‌కుమార్ ప్రతిభను ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పేర్కొన్నారు. ఆ పోటీల్లో విజేతగా నిలవాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటనారాయణగౌడ్, జి.మనోజ్‌కుమార్, ఆవుల అశోక్, చంద్రశేఖర్‌రెడ్డి, జి.రాజు, సురేశ్‌లు అభినందనలు తెలిపారు.

## పంట చేతికొచ్చే..
# విక్రయాల్లో తిప్పలాయే!



ధాన్యంతో నిండిన కవర్‌షెడ్

**జనగామ, న్యూస్‌టుడే:** ఆకస్మిక వర్షాలతో చేతికొచ్చే వరిచేన్లను కాపాడుకోలేక ఇబ్బందులు పడుతున్న రైతులకు ధాన్యం విక్రయంలోనూ తిప్పలు తప్పడం లేదు. జనగామ వ్యవసాయ మార్కెట్‌కు రోజుకు సుమారు ఏడు వేల బస్తాల ధాన్యం వస్తోంది. ఉన్న రెండు కవర్‌షెడ్లు నిండిపోతున్నాయి. మార్కెట్ క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా 11 నుంచి 3 గంటల వరకు వ్యవసాయ ఉత్పత్తులను లోనికి అనుమతించడం లేదు. దీంతో వాహనాలు బారులు తీరుతున్నాయి. షెడ్లలో చోటు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను పట్టించుకునే వారే కరవయ్యారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే దాకా మార్కెట్‌పై వత్తిడి తప్పని పరిస్థితి. జిల్లా అధికారులు ఈ విషయమై దృష్టి సారించాల్సి ఉంది.




జనగామ వ్యవసాయ మార్కెట్ ఎదుట బారులు తీరిన ధాన్యం వాహనాలు

## అంగన్‌వాడీ కేంద్రాలకు అందని పుస్తకాలు

**దేవరుప్పుల, న్యూస్‌టుడే:** అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేస్తూ, సరళతర బోధనకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుంది. కొత్త విధానాన్ని అనుసరించి ఈ నెల నుంచి బోధించాల్సిన పాఠ్యపుస్తకాలను ఇంతవరకు అందించలేదు. దీంతో టీచర్లు, సిబ్బంది చిన్నారులతో కాలం గడుపుతున్నారు.

- ● ఇది వరకు ఏడాది పాఠ్యప్రణాళికను పుస్తక రూపంలో విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అందించేవారు. దీంతో పాఠాలు సరిగా సాగడం లేదని నిపుణులు సూచించడంతో వర్తమాన విద్యా సంవత్సరం నుంచి ఇస్తున్నారు.
- ● ప్రస్తుతం నిత్య నూతనంగా ఉండేలా ప్రతి మూడు నెలలకో సారి సవరించిన పుస్తకాలను అందిస్తామని ప్రకటించారు. సెప్టెంబర్ నాటికి ముగిసేవి అందించి, కేంద్రాల టీచర్లకు అనుసరించాల్సిన మెలకువలను నేర్పారు. చిన్నారులను ఆకర్షించేలా జంతువులు, కాయలు, పండ్లు, చెట్ల బొమ్మలను గీశారు. సెప్టెంబర్ నెలాఖరు నాటికే కొత్త పుస్తకాలు అందుతాయని అందరూ భావించినా, సమయానికి రాకపోవడంతో నిరాశ వ్యక్తమవుతోంది.




సెప్టెంబరుతో ముగిసిన పాఠ్యపుస్తకం

| | |
|---|---|
| జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు : 695 | 1-6 ఏళ్ల చిన్నారులు : 20,472 |




(c) eenadu

# ఆహారం విలువ తెలిసి.. ఆకలి తీర్చి..

ఒకవైపు ఆకలితో అలమటించేవారు.. మరోవైపు ఆహారం ఎక్కువై వృథా చేస్తున్నవారు మనకు కనిపిస్తుంటారు. ప్రతి మెతుకు నిరుపేదలు, అనాథల కడుపు నింపితే అంతకంటే మేలు మరొకటి ఉండదు. ఈ నిజాన్ని గుర్తించి ఆహారం వృథా కాకుండా అన్నదానం రూపంలో పేదలకు అందజేస్తున్న వారెందరో ఉన్నారు. బుధవారం ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని నేటి కలంలో ఆహారం ఎంత విలువైందో.. దాన్ని వృథా చేయకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..

నేడు ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం





### ఆ బాధ తెలుసు కాబట్టే..

**- రాందేని ధనలక్ష్మి, శ్రీనివాస్, హనుమకొండ**

మా బాబు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స కోసం ఐదునెలలు ఉన్నప్పుడు ఆకలి బాధ తెలిసింది. ప్రతి రోజు ఆహారం పంపిణీ చేసే స్వచ్ఛంద సంస్థలను చూసేవాళ్లం. వారి దాతృత్వం మాకెంతో ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించాలనిపించింది. ఆ ఆలోచన కరోనా సమయంలో రాగా గురుదక్షిణ నిత్యాన్నదాన సొసైటీ ఏర్పాటు చేసి వరంగల్, హనుమకొండ, కాజీపేట రైల్వే బస్టాండు, ఫుట్‌పాత్‌లపై ఉండే అనాథలు, మానసిక ఇబ్బందులతో ఉన్న వారికి అన్నదానం చేస్తున్నాం.

### లక్షన్నర మందికి

**- కొండమీది రాజన్ బాబు, ఉర్సు, వరంగల్**

కరోనా సమయంలో ఆకలితో బాధపడుతున్న అనాథలకు అన్నదానం చేయడంతో మొదలైన నా సేవ కన్నతల్లి ఫౌండేషన్ ఏర్పాటుకు దారితీసింది. సంస్థ ద్వారా శుభకార్యాలు, పంక్షన్ హాళ్లలో, మిగిలిన ఆహారం సేకరించి శంభునిపేట, వరంగల్ బస్టాండ్, రైల్వేస్టేషన్, వరంగల్ చౌరస్తా, ఎంజీఎం ఆసుపత్రిలో అన్నదానం చేస్తున్నాం. మిగిలిన భోజనం ఇస్తే మా సంస్థ ద్వారా ప్లేట్లు, గ్లాసులు, తాగునీరు తీసుకెళ్లి అన్నదానం చేస్తున్నాం. ఇప్పటికి లక్షన్నర మందికి అన్నదానం చేశాం.

● ఆహారం మిగిలితే 97017 51278 నెంబరుకు తెలియజేయాలి.





### మీకు తెలుసా..

మన ఆహార అలవాట్లు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) నివేదిక పేర్కొంది. వృథా చేయకుండా పర్యావరణ హితంగా ఆహారం తీసుకోవడం వల్ల మన దేశం ఆహార ఉత్పత్తికి ఇతర దేశాలకంటే తక్కువ భూభాగం వాడుతున్నామని చెప్పింది. జనాభా ఎక్కువగా ఉన్నా కేవలం 0.8 శాతం భూమిని మాత్రమే వాడుతున్నాం. చైనా 1.7 శాతం, జపాన్ 1.8, అర్జెంటీనా 7.4 ఆస్ట్రేలియా 6.8, అమెరికా 5.5 శాతం వాడుతున్నట్లు ఆ నివేదిక తెలిపింది. ● ఉమ్మడి వరంగల్ జిల్లా ఇతర జిల్లాలతో పోలిస్తే ఆహార ఉత్పత్తికి 0.75 శాతం వినియోగిస్తోందని వ్యవసాయ శాఖ తెలిపింది.



పల్లగుట్ట ఉన్నత పాఠశాలలో తిథి భోజనం.. పాఠశాల పరిధిలో ఎవరైనా విద్యార్థులకు ఇలా ఆహారం అందజేస్తారు



### లెక్క పెట్టి మరీ..

అమెరికాలాంటి దేశాల్లో శుభకార్యాలు చేయడానికి, ఆహ్వానంతో పాటు గూగుల్ ఫారం కూడా పంపుతారు. ఆన్‌లైన్‌లో శుభకార్యానికి వస్తున్నారా లేదా.. వస్తే ఎంత మంది వస్తారు అనే విషయాన్ని అందులో పొందుపరచాలి. దీన్ని బట్టి వంటలు తయారు చేస్తారు. దీంతో ఆహారం వృథా కాదు. ఐటీవల ఎన్‌ఆర్ఐ ఆడాల్లుడు సి.ప్రసాదు తన కుమారుడి వివాహానికి ఇలాగే ఆన్‌లైన్ ఫారం పంపి దానికి తగినట్లుగా వంటలు చేయించారు.



### ఇతర దేశాల్లో..

● ఫ్రాన్స్‌లో మిగిలిపోయిన కూరగాయలు కూడా బయటపడేస్తే నేరంగా భావిస్తారు. వాటిని పేదలకు ఇవ్వాలి. ● నార్వే ఆహార పదార్థాలపై బెస్ట్ బిఫోర్ యూస్ అని ప్రింట్ చేస్తుంది. ఇటలీ, ఫ్రాన్స్, చైనా, అమెరికాలోనూ ఇలాంటి చట్టాలు న్నాయి.

### ఈ జాగ్రత్తలు తీసుకుందాం

● బంగాళదుంపలు, టమాటాలు, ఉల్లిపాయలు, వెల్లుల్లి, దోసకాయలు ఫ్రిజ్‌లో కాకుండా గది ఉష్ణోగ్రతలోనే నిల్వచేయాలి.
● ఆహారం కాడలను నీటిలో ఉంచడం ద్వారా నిల్వ చేసుకోవచ్చు.
● బ్రెడ్ గడువుల్లోగా వాడేయలేమని భావిస్తే ఫ్రిజ్‌లో నిల్వచేయాలి.
● దుకాణం నుంచి ఆహార పదార్థాలను కొనుగోలు చేసే సమయంలో వాటి నిల్వ కాలం చూసుకుని తెచ్చుకోవాలి.
● తరచూ ఆహారం మిగులుతుంటే దాన్ని ఫ్రిజ్‌లో పెట్టి ఒక రోజు వాటిని ఉపయోగించేలా ప్రణాళిక వేసుకోవాలి.
● పెరటిలోని కూరగాయల మొక్కలకు కంపోస్టు ఎరువుగా వేయడం ద్వారా ఆహార వృథా నివారించవచ్చు.
● ఇంట్లో ఉన్నవారి ఆహార అవసరాన్ని గుర్తించి తయారు చేసుకోవడం, అవసరమైనప్పుడే తయారు చేసుకోవడం వంటి చిట్కాల ద్వారా వృథా తగ్గించవచ్చు.
● ఆదనంగా ఉన్న ఆహారాన్ని దగ్గరి వారికి, పక్క వారికి పంచడం, ఆశ్రమాలకు, అనాథలకు ఇవ్వడం చేయాలి.
● ఆహార బ్యాంకులను ఏర్పాటు చేసి అందులో వేయడం ద్వారా అవసరమైన వారు తీసుకునేలా ఏర్పాట్లు చేయడం.
● ఆహార వ్యర్థాలను తగ్గించడానికి హోటళ్లు, గృహ యజమాను ప్రోత్సాహకాలు అందించడం చేయాలి.

### పది హేను సంవత్సరాలుగా

**- ఆరుట్ల శ్రీనివాస్, సాయి అమృతహస్తం సంస్థ, వరంగల్**

15 ఏళ్ల కిందట గురుపౌర్ణమి నాడు అన్నదానంతో మిగిలిన ఆహారాన్ని అనాథలకు పంపిణీతో మొదలైన నా సేవ ఇప్పటికీ కొనసాగిస్తున్నా. సాయి అమృత హస్తం

కాజీపేట, శివనగర్, న్యూస్‌టుడే



పేరుతో మిత్రులు పోలా మహేష్, ఎరుకల నాగేశ్వర్‌రావు, పబ్బ కిషోర్, వేముల శ్రీనివాస్‌తో కలిసి కల్యాణమండపాలు, హోటళ్లు, క్యాటరింగ్ సర్వీసు సెంటర్లలో మా సంస్థ గోడప్రత్రికలు వేసి, మిగిలిన ఆహారాన్ని మాకు అందించేలా చేస్తున్నాం. అలా నెలలో నాలుగు సార్లు బస్టాండు, రైల్వే స్టేషన్లలో పంపిణీ చేస్తున్నాం.

### అవును.. నిజమే!

● ప్రతిరోజు వరంగల్ మహా నగరపాలక సంస్థ సేకరిస్తున్న వ్యర్థాల్లో సుమారు 40 టన్నులు ఆహార వ్యర్థాలే ఉంటున్నాయని అధికారులు చెబుతున్నారు.
● దేశంలో పోషకాహార లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య 14 శాతం ఉంది. వృథా ఆహారం వారికి అందేలా చేయడం ద్వారా వారి శాతం తగ్గించొచ్చు.
● కుళ్లిన ఆహార పదార్థాలు చెత్తకు తరలించడం వల్ల కార్బన్ డై ఆక్సైడ్ కంటే 80 రెట్లు ఎక్కువ శక్తివంతమైన గ్రీన్‌హౌస్ వాయువైన మీథేన్ విడుదలవుతోందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

### నాలుగేళ్లుగా అన్నదానం

**- నాల్లపురం రాజు**

మాది జనగామ జిల్లా పాలకుర్తి. చదువుకోవడానికి హనుమకొండకు వచ్చాక ఇక్కడ ఆకలి బాధ తెలిసింది. ఆద్విస్ట్ లైఫ్ ఫౌండేషన్ సంస్థను ఏర్పాటుచేసి, దాని ద్వారా ఆహారాన్ని ఫంక్షన్ హాళ్ల నుంచి సేకరించి నాలుగేళ్లుగా అనాథలు, ఆశ్రమాలు, బస్టాండు, రైల్వే స్టేషన్లలో పంపిణీ చేస్తున్నాను.

### ఇలా చేస్తే మేలు..

కార్పొరేషన్ ఆధ్వర్యంలో వృథా ఆహారాన్ని పేదలకు అందించే వ్యవస్థ ఏర్పాటుచేసి ఒక హెల్ప్‌లైన్ నెంబరు ఏర్పాటు చేయాలి. వరంగల్ హెల్పింగ్ హ్యాండ్ ఛారిటీ, సహారా ఫౌండేషన్ సంస్థలు సామాజిక మాధ్యమాల ద్వారా వృథా ఆహారాన్ని సేకరించి అనాథలకు పంచుతున్నాయి. శుభకార్యాల్లో మిగిలిన ఆహారం తీసుకోవడానికి సద్భావన ఆశ్రమం, నిరాశ్రయుల సేవా ట్రస్టు, ఆరోగ్య సామాజిక సేవా సంస్థ, డాన్‌బాస్కో శివనగర్, హోప్ ఆఫ్ జాయ్ ఉంటాయి.

### ఇంటి ఆహారంలో..

**- డాక్టర్ యాట రోహిత్‌రెడ్డి, వడ్డెపల్లి**



ఇంటి ఆహారంలో తాజాదనం ఉంటుంది. ఎక్కువగా నూనెలు వాడకుండా ఉడికించి తింటాం కాబట్టి అందులోని లవణాలు, విటమిన్లు పాడవకుండా ఉంటాయి. వృథా కూడా తక్కువే.. బయటి హోటల్ యజమానులు అమ్ముడు పోని కూరగాయలు ఎక్కువ వాడుతారు కాబట్టి తాజాదనం తగ్గుతుంది.

### ప్రజల్లో అవగాహన పెరిగింది..

**- ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, వరంగల్**



ఆహార పదార్థాల వినియోగంపై వరంగల్ ప్రజల్లో అవగాహన పెరుగుతుంది. ఆదిశాగా కొనుగోలు చేస్తున్నారు. కొన్ని చోట్ల మోసాలు జరుగుతున్నాయి. తాము గమనించి కేసులు నమోదు చేస్తున్నాం.

**అంకెల్లో వివరాలు..**

వరంగల్‌లో ఆహారం వృథా : 18 శాతం

ఇందులో శుభకార్యాల్లో 10

| | |
|---|---|
| ఇంటిలో.. | 1 |
| హాస్టళ్లలో.. | 2 |
| హోటళ్లలో | 3 |
| ఇతర | 2 |

## రాయితీ రుణం ఇప్పిస్తామని టోకరా

**ఎల్కతుర్తి, న్యూస్‌టుడే:** ప్రభుత్వం నుంచి రాయితీ రుణం ఇప్పిస్తామని నమ్మించి ఒకరు టోకరా వేసిన ఘటనపై ఆలస్యంగా కేసు నమోదు అయింది. ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెరకు చెందిన కొక్కు తిరుపతి చరవాణికి ఈ ఏడాది ఏప్రిల్ 26న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశారు. మీకు ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం రుణం రూ.10 లక్షలు మంజూరైందని ఒకసారి, రుణం ఇప్పిస్తానని ఒకసారి చెప్పారు. కొంత డబ్బు చెల్లిస్తే రుణం త్వరగా మీ బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. రుణం వస్తుందని ఆశపడిన తిరుపతి గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన ఖాతాకు పలు దఫాలుగా రూ.98,530 ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేశారు. కొద్ది రోజులకు ఆ నెంబరుకు ఫోన్ చేసి ఇంకా రుణం రాలేదని అడగ్గా.. కొంత సమయం పడుతుందని సమాధానం ఇచ్చారు. నెలలు గడిచినా రుణం మంజూరు కాకపోవడంతో అవతలి వ్యక్తికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వచ్చింది. మోసపోయానని గ్రహించిన బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## 161 క్వింటాళ్ల రాయితీ బియ్యం పట్టివేత



బియ్యం స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

**వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే:** ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించాల్సిన రాయితీ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన కేంద్రాలపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. మొత్తం రూ.4.19 లక్షల విలువచేసే 161 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు.. పరకాలకు చెందిన బి.రఘు, ఎస్.ఉప్పలయ్య కలిసి పరకాల చుట్టుపక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు రాయితీ బియ్యం కొనుగోలు చేసి జ్యోతి రైస్ మిల్లులో నిలువ ఉంచారు. తనిఖీలు నిర్వహించగా సుమారు రూ. 2.63 లక్షల విలువచేసే 101 క్వింటాళ్ల బియ్యం లభించాయి. నడికూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన ఒడేలు రూ.1.17 లక్షల విలువ చేసే 45 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తూ పట్టుబడ్డారు. నడికూడ మండలం బుడిగజంగాల గ్రామానికి చెందిన తూర్పాటి ఐలయ్య ఇంట్లో రూ.39 వేల విలువ చేసే 15 క్వింటాళ్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు, ఆరెల్లి భానుప్రకాశ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్టాఫ్‌నర్సు ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల

**ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే:** జిల్లా వైద్యారోగ్యశాఖలో గతంలో ఇచ్చిన స్టాఫ్‌నర్సుల నియామక ప్రకటనకు స్పందించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను డీఎంహెచ్‌ఓ, జిల్లా కలెక్టర్ కార్యాలయం నోటీసు బోర్డులో ప్రదర్శనకు పెట్టినట్లు డీఎంహెచ్‌ఓ డా.వెంకటరమణ తెలిపారు. జాబితాలోని సమాచారంపై అభ్యంతరాలుంటే ఈ నెల 16, 17 తేదీల్లో సాయంత్రం 5 గంటల్లోగా అందజేయాలని కోరారు. ప్రొవిజనల్ మెరిట్ జాబితా కోసం అధికారిక వెబ్‌సైట్ http://waranagl.telanagana.gov.in చూడాలని సూచించారు.

# చెరువు శిఖం.. కబ్జాల పర్వం

### ● హైడ్రా తరహా ఏర్పాటే శరణ్యం..



ధర్మసాగర్ రిజర్వాయర్‌లో మొరం పోసి చదును చేసిన భూమి





**ధర్మసాగర్, న్యూస్‌టుడే:** ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేసి హైదరాబాద్ నగరంలోని చెరువుల్లో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతోంది. ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తూ అక్రమ నిర్మాణాలను తొలగిస్తోంది. అలాంటి వ్యవస్థే హనుమకొండ జిల్లాలోనూ అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగరం చుట్టుపక్కల చెరువు శిఖం భూమి కనిపిస్తే చాలు హద్దులు పాతుతున్నారు. ధర్మసాగర్ మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలకు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంకు లెవల్) గుర్తించి, హద్దులు ఏర్పాటు చేయడంలో నీటి పారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీన్ని అక్రమార్కులు అవకాశంగా తీసుకుని యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. కొందరు చెరువు శిఖంలో మొరం పోస్తూ సొంతం చేసుకుంటున్నారు. ఆయా గ్రామాల రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం.

● ధర్మసాగర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన భూమిని ఓ రైతు పట్టా చేసుకుని అందులోని రెండెకరాలను రూ.80 లక్షలకు చొప్పున ఆరు నెలల కిందట విక్రయించారు. రిజర్వాయర్ మత్తడి 15 నుంచి 20 ఎకరాల వరకు ఉన్న రైతులు కొందరు పట్టా చేసుకున్నారు. మరికొందరు ముంపునకు గురైన భూముల్లో మట్టి, మొరం పోసి ఎత్తు పెంచుకుని సాగు చేసుకుంటున్నారు.

● ఎలుకుర్తిలోని సర్వే నెంబర్ 141లో మల్లెవారి చెరువు 40.33 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీని శిఖం ఇప్పటికే 10 ఎకరాల వరకు కబ్జా అయినట్లు సమీప రైతులు ఆరోపిస్తున్నారు.

● పెద్దపెండ్యాలలో మూడేళ్ల కిందట ఓ రైతు కట్టను తొలగించి చెరువు భూమిని తన పొలంలో కలుపుకొనే ప్రయత్నం చేశారు. ఇదే గ్రామంలో మరో చెరువు మత్తడి పోసే చోట మట్టి పోసి నీరు రాకుండా చేశారు.

● శాయిపేట పాత చెరువులో భూమి తన పట్టా స్థలమంటూ మూడేళ్ల కిందట ఓ రైతు చెరువు కట్టను తొలగించి, మొరం పోయించారు. మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక రైతులు దాన్ని అడ్డుకున్నారు. ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టలేదు. మొరాన్ని తొలగించలేదు. దీంతో వర్షం నీరు, దేవాదుల పైప్‌లైన్ నీరు చెరువులోకి వచ్చినా కిందకు వెళ్లిపోతున్నాయి.

● జానకీపురం, కేశవనగర్, క్యాతంపల్లిలో కుంటలు కబ్జాకు గురవుతున్నాయి.



శాయిపేట పాత చెరువులో పోసిన మొరం

### హద్దులను నిర్ధారిస్తాం..

**- సదానందం, తహసీల్దార్, ధర్మసాగర్**

నీటి పారుదల, రెవెన్యూ శాఖల సమన్వయంతో మండలంలోని అన్ని చెరువులు, కుంటలకు హద్దులను నిర్ధారించి, సంరక్షణ చర్యలు చేపడతాం. నీటి పారుదల శాఖ అధికారులు ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తే.. సర్వే చేసి ఆయా సర్వే నెంబర్లకు నాలా కన్వర్షన్లు ఇవ్వకుండా, అక్రమ పట్టా చేసుకోకుండా తగిన చర్యలు చేపడతాం.

## మల్లన్న హుండీ ఆదాయం రూ.46 లక్షలు

**ఐనవోలు, న్యూస్‌టుడే:** ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయం లెక్కించారు. ఈ ఏడాది జులై 16 నుంచి అక్టోబర్ 15 వరకు 18 హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని మహబూబాబాద్ శ్రీలక్ష్మి వెంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ పరిశీలకులు ఎ.అనిల్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. హుండీల ద్వారా రూ.20,73,376, వివిధ సేవల టికెట్ల ద్వారా రూ.25,35,820 కలిపి మొత్తం రూ.46,09,196 ఆదాయం వచ్చినట్లు ఈవో నాగేశ్వర్‌రావు తెలిపారు. బంగారం, వెండి, విదేశీ డాలర్లను తిరిగి హుండీలో వేశారు. మూడేళ్లుగా ఆలయ ఆదాయం గణనీయంగా పెరుగుతూ వస్తోందని ఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, ఆలయ మల్లయ్య, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.


EENADU Classifieds

FINANCIAL SERVICES

TVS క్రెడిట్ సర్వీసెస్ లి.లో యూజ్‌డ్ కార్లు & బైక్స్ లోన్స్ అన్ని బ్రాంచ్‌లలో మరియు ఆకర్షణీయ వడ్డీ రేటులో ఇవ్వబడును. మరిన్ని వివరాలకు సంప్రదించండి: 91001 11717, 91009 88506.

PROFESSIONAL SERVICES

ASTROLOGY

PEOPLE CARE

OLD AGE HOME

REAL ESTATE

COMMERCIAL SPACE FOR SALE

హన్మకొండ సుబేదారి మెయిన్ రోడ్డులో మంచి కిరాయిలు వచ్చే 355 Sq.Yds. గల G+3 కమర్షియల్ బిల్డింగ్ అమ్మబడును. సెల్: 9866071830, 9502267322.

JOBS

Select- Bajaj, Hunter Road, 1) Sales Executives(Male) Fresher or Experience, 2) Pre Delivery Inspector ✆ 9000102444.

Hnk లో 85 సం.ల వృద్ధురాలికి, ఇంట్లో ఉంటూ సేవ చేయుటకు మహిళ కావలెను. 9849163063, 8523062062.

ఫైనాన్స్ ఆఫీస్‌లో పనిచేయుటకు Collection Executives Urgent గా కావలెను. T/W Must, Age: 35 లోపు. సంప్రదించండి: 8309023090, 8522078842.

ప్రముఖ ISO సర్టిఫికేట్ గల కంపెనీలో పనిచేయుటకు మేనేజర్స్, జనరల్ మేనేజర్స్ స్త్రీ/పు కావలెను. సెల్: 9866137009.

వరంగల్ "O" సిటిలో పనిచేయుటకు ఇంటి పనిమనిషి కావలెను. జీతం 5000/-, Timing: 6.30 to 3PM వరకు Cont: 9003298892.

Excellent Income Earning Opportunity Wanted Health Insurance Advisors Eligibility House Wifes and Retired ✆ 9985979789.

Wanted English Teacher to Teach VI-X Classes, Salary Negotiable, St. Mary's High School (EM), Hasanparthy. Ph.No's: 9989842434, 9908761405.

1 year జబిని చూసుకోవడానికి & ఇంటిపనులకు Female ఆయా కావలెను. Free ఫుడ్ & వసతి ఇవ్వబడును. ✆ 9441270016.

నర్సంపేట నందు ప్రముఖ కొరియర్ సంస్థలో పనిచేయుటకు Delivery boys కావలెను. Contact: 9989731552, 8498987207.

వరంగల్ లో సిటిలో రియల్ ఎస్టేట్ లో GM/MM, M/F కావలెను. Contact: 8555936358, 8106342859.

హనుమకొండ నందు హోటల్లో పనిచేయుటకు కుకింగ్ మాస్టర్స్, సప్లయర్స్, రిసెప్షన్ కావలెను. Cell: 9010533562.

హైదరాబాదులో ఫ్యాక్టరీలో పనిచేయుటకు హెల్పర్స్ -5, ఆపరేటర్స్ -8 కావలెను. Hnk. 9515954923, 8885003401.

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు పాఠకులు పూర్తిగా విచారించుకోవలెను. ఈ పాఠకుల వార్తాపత్రికకు ఎటువంటి సంబంధం లేదు. ప్రకటనదారుల నుంచి ఏదైనా నష్టం జరిగితే ఈనాడు యాజమాన్యానికి ఎటువంటి బాధ్యత లేదు.


# చరిత్ర తెలుసుకోండి.. వాలంటీర్లుగా నిలవండి





కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ములుగు పాలనాధికారి దివాకర, ఇంటాక్ కన్వీనర్ పాండురంగారావు తదితరులు



శిబిరానికి హాజరైన వాలంటీర్ల బృందంతో అధికారులు

**వెంకటాపూర్, న్యూస్‌టుడే:** విద్యార్థి దశలో వచ్చే ప్రతి అవకాశం భవిష్యత్తులో పునాదికి ఎంతో అని ములుగు జిల్లా పాలనాధికారి టీఎస్ దివాకర అన్నారు. మూడో విడత శిక్షణ శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరూ చరిత్రను తెలుసుకుని చక్కటి వాలంటీర్లుగా నిలవాలని కోరారు. అక్టోబర్ 15 నుంచి 26 వరకు యునెస్కో గుర్తింపు పొందిన రామప్పలో జరిగే వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ మూడో శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావుతో కలిసి ప్రారంభించారు. ఐకోమాస్, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, తెలంగాణ టూరిజం, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు భాగస్వామ్యంతో ప్రారంభమైన శిబిరంలో 80 మంది వాలంటీర్లనుద్దేశించి ఆయన మాట్లాడారు. చరిత్ర, కళలు, పురావస్తు, ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజినీరు, టూరిజం విభాగాల్లో నైపుణ్యం కలిగిన ప్రొఫెసర్లు చెప్పే తరగతులను ఆసక్తిగా వినాలని సూచించారు. యునెస్కో గుర్తింపు ఆలయం చేసుకున్న క్షేత్రస్థాయిలో తెలుసుకుని సేవ చేయడానికి ఇదొక అరుదైన అవకాశమన్నారు. రాబోయే రోజుల్లో టూరిజం ద్వారా ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని, ఇప్పటి నుంచి అవగాహన పెంచుకుంటే భవిష్యత్తు మీదే అన్నారు. కాకతీయుల ఖ్యాతి ఖండాంతరాలు దాటిందని, దానిని తెలుసుకుని విస్తృతం చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. సమయం వృథా చేయకుండా ప్రతిభ చూపి కాకతీయ ప్రాశస్త్యాన్ని చాటాలని కోరారు. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఇంటాక్ సూచనలు చేసింది. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి శివాజీ, టూరిజం ప్రమోషన్ అధికారి సూర్యకిరణ్, ఇంటాక్ సభ్యుడు శ్రీధర్‌రావు, కన్వీనర్ రాజు, శ్రీలత, యోగా గురువు రాంబాబు, ఎంపీడీవో రాజు, పర్యాటక, పురావస్తు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**చికెన్ ధరలు**

(కిలో వెల రూపాయల్లో)

వెన్‌కాబ్


| | |
|---|---|
| ఫాం: | 126 |
| రిటైల్: | 148 |
| డ్రెస్: | 215 |
| స్కిన్‌లెస్: | 244 |



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎమ్మెల్యే ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, మరో చిత్రంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## నూకల నరేష్‌రెడ్డికి నేతల నివాళి

**మరిపెడ, న్యూస్‌టుడే:** దివంగత కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పురుషోత్తమాయగూడెంకు చెందిన నూకల నరేష్‌రెడ్డి దశదినకర్మ మంగళవారం గ్రామంలోని ఏలివాక వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. పలువురు హాజరై ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, శాసనసభ్యులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజకీయ జీవితంలో నరేష్‌రెడ్డితో తమకు ఉన్న అనుబంధం గుర్తు చేసుకున్నారు.



నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు, రఘురాంరెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దయాకర్‌రావు, రావుల శ్రీధర్‌రెడ్డి, బండా ప్రకాష్

(c) eenadu

## అన్ని వర్గాల శ్రేయస్సుకు దుర్గమ్మ పండగ


మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, చిత్రంలో నాయకులు

**జనగామ, న్యూస్‌టుడే:** అన్ని వర్గాల ఐక్యతకు, అభివృద్ధికి, క్షేమానికి దుర్గమ్మ పండగ తోడ్పడుతుందని, గ్రామ దేవతల పండగలు కులాలకు అతీతంగా నిర్వహించుకునే ఉత్సవమని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక బతుకమ్మకుంటలోని దుర్గమ్మ, ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఆయన దుర్గమ్మ పండగ ఏర్పాట్లపై కమిటీ ప్రతినిధులు, ఏసీపీ పార్థసారథి, సీఐ దామోదర్‌రెడ్డితో మాట్లాడారు. ఉత్సవంలో పాల్గొనే భక్తులకు మున్సిపల్, పోలీసు, ఇతర శాఖల ఆధ్వర్యంలో కావాల్సిన సౌకర్యాలు, బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గానికి రూ.10 కోట్ల ప్రత్యేక నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందన్నారు. తాగునీరు, విద్య తదితర ముఖ్యమైన పనులకు కేటాయించి పోగా నియోజకవర్గానికి కేటాయించిన ప్రత్యేక నిధుల నుంచి రూ.1.45 కోట్లను జనగామ పట్టణంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు మంజూరు చేయించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట మార్కెట్ ఛైర్మన్ బనుక శివరాజ్, డాక్టర్ రాజమౌళి, మేడ శ్రీనివాస్, వంగాల కళ్యాణి, లోకమంతరెడ్డి, బొట్లశ్రీనివాస్, రాంచందర్, జక్కుల అనిత తదితరులున్నారు.

## పాఠశాలల విద్యార్థులు.. పర్యాటక రాయబారులు

**దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే:** విద్యార్థులు నిత్యం చదువు, పరీక్షలు, గ్రేడుల సాధనలోనే దృష్టి సారిస్తున్నారు. చారిత్రక వారసత్వ సంపద, ప్రాంత ఔన్నత్యం గురించి నేర్చుకునే తీరిక లేదు. ప్రభుత్వం 7-12వ తరగతి వరకు నిర్వహిస్తున్న విద్యా సంస్థల్లో ఈ కార్యక్రమం ప్రారంభించింది. ప్రతి పాఠశాల టూరిజం క్లబ్‌లో నమోదు చేసుకుని ప్రారంభించింది. కేజీబీవీ, ఆదర్శ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు తెలంగాణ వీటిని కొనసాగిస్తున్నారు. ప్రతి పాఠశాలలో 25 మంది విద్యార్థులను గుర్తించి, వారిలో చురుకైన ఒకరిని సంఘ నాయకుడిగా గుర్తించారు.

☛ ఆయా పాఠశాలల్లో సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయుడిని వీరికి మెంటార్‌గా నియమించారు. జిల్లా ప్రాంత విశేషాలు సేకరించి పాఠశాలలోని సభ్యులకు అవగాహన కల్పిస్తారు. స్థానిక, జిల్లా, రాష్ట్ర పరిధిలో విశేషాలను సేకరించి వివరిస్తున్నారు.

☛ ప్రభుత్వం వీటిని ముున్ముందు బలోపేతం చేయనుంది. సభ్యులను స్థానికంగా వారసత్వ కట్టడాలు, చారిత్రక ప్రాంతాల సందర్శనలకు తీసుకెళ్తుంది. ప్రాజెక్టు సభ్యులకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు. వివిధ విభాగాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పించనున్నారు.

☛ ప్రభుత్వ ప్రైవేట్ విద్యా సంస్థలకు ప్రభుత్వం నుంచి అందిన క్లబ్బుల ఏర్పాటుపై సమాచారమిచ్చారు. దరఖాస్తు చేసుకున్న పాఠశాలలకు ప్రవాస ... ఉపాధ్యాయులు ప్రతి రోజు ఉదయం లేదా సాయంత్రం వేళ పాలు వివరిస్తుండగా, క్లబ్ సభ్యులు నోట్స్ రాసుకుంటున్నారు.


దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి ఉన్నత పాఠశాలలో క్లబ్ సభ్యులకు స్థానిక విశేషాలు చెబుతున్న ప్రధానోపాధ్యాయురాలు సుచిత్రఆనంద్

### మా ఊరి అసలు పేరు తెలుసుకున్నా..


- డి.శ్రుతి, పదో తరగతి, మాధాపురం జడ్పీ ఉన్నత పాఠశాల

నేను టూరిజం యువ క్లబ్‌లో చేరాను. మా ఊరి అసలు పేరు మహదేవపురం అని తెలుసుకున్నాను. ప్రతి రోజు సాయంత్రం అరగంట మా ఊరి ప్రత్యేకతతో పాటు మండలంలో చూడాల్సిన ప్రాంతాల గురించి టీచర్ చెబుతున్నారు.

### గ్రామాల ప్రత్యేకతలు తెలుస్తున్నాయి..


- వినయ్, పదో తరగతి, సింగరాజుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల

యువ క్లబ్‌లో చేరాక ఉపాధ్యాయులు సాయంత్రం వేళ మండలంలోని అన్ని గ్రామాల ప్రాధాన్యతను వివరిస్తున్నారు. అంతర్జాలం అనుసంధించిన చరవాణి ద్వారా మరిన్ని వివరాలు దసరా సెలవుల్లో సేకరించాను. మిగతా సభ్యులకు వివరిస్తాను.

## మేమున్నాం.. మీకు తోడుగా

జనగామ: 80085 74872
జనగామ అర్బన్: 80749 20132
పాలకుర్తి: 98663 66702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

**లింగాలఘనపురం:** కుందారం ఒకటో వార్డులో వీధి బురదమయం అవుతోంది. వర్షం నీరు, వీధిలోకి రాకుండా చూడాలి. -స్థానికులు
**సమాధానం:** పరిశీలించి పరిష్కరిస్తాం. - ఎంపీవో, రఘురామకృష్ణ.
☛ చౌరస్తాలో గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి మరమ్మతు చేయించాలి. - రాధాకిషన్, జీడికల్
**సమాధానం:** అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. - జలంధర్‌రెడ్డి, ఎంపీడీవో, లింగాలఘనపురం
**పాలకుర్తి:** మండల కేంద్రంలోని అంగడి బజారులో మిషన్ భగీరథ పైప్‌లైను లీకేజీ కావడంతో తాగునీరు సరిగా రావడం లేదు. - రాజు, స్థానికుడు
**సమాధానం:** సిబ్బందితో మరమ్మతు చేయిస్తాం. - వెంకటేశ్వరచారి, పంచాయతీ కార్యదర్శి
**రఘునాథపల్లి:** మండలంలోని మాదారం రక్షిత తాగునీటి ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు పైకప్పు శిథిలమై పెచ్చులు ఊడుతోంది. మరమ్మతులు చేయించాలి. - గ్రామస్థులు
**సమాధానం:** మరమ్మతు పనులు చేపట్టాలని స్థానిక పంచాయతీని కోరాం. -అబ్దుల్ హనాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

## రాష్ట్ర సదస్సుకు తరలిరావాలి


మాట్లాడుతున్న రాగల్ల ఉపేందర్

**జనగామ అర్బన్, న్యూస్‌టుడే:** ఎమ్మార్పీఎస్ భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణపై చర్చించేందుకు నేడు (బుధవారం) నిజామాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి సదస్సుకు తరలిరావాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పైసా రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాలను భర్తీ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి మాదిగలను మభ్యపెడుతూ వర్గీకరణ లేకుండానే నియామకాలు చేపట్టేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరై భవిష్యత్తు కార్యాచరణపై దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జి.కిశోర్, సందెన రవీందర్, బొట్ల మహేశ్, తుర్కపల్లి అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌కు సన్మానం



**స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే:** స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన జూలకంటి లావణ్య శిరీశ్‌రెడ్డిని మండలంలోని రంగరాయగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు మంగళవారం సన్మానించారు. సీపీఎం మండల కార్యదర్శి మునిగాల రమేశ్, ఇప్పగూడెం సీపీఎం కార్యదర్శి గట్ల మల్లారెడ్డి, నాయకులు రాజు, పరమేశ్వర్, రాజు, సాంబయ్య, ఐలయ్య, కొమురయ్య, గంగయ్య, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సంక్షేమ అధికారిణికి సత్కారం



**జనగామ టౌన్, న్యూస్‌టుడే:** జిల్లా సంక్షేమ అధికారిణిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఫ్లోరెన్స్‌ను తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం కలిసి అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కు అరుణ, జిల్లా అధ్యక్షురాలు కోమల్ల ఎల్లమ్మ, ప్రతినిధులు రేణుక, అనిత, రజిత, కవిత, ధనలక్ష్మి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

## మహిళ కడుపులో 5 కిలోల కణతి

**జనగామ టౌన్, న్యూస్‌టుడే:** ఓ మహిళ కడుపులో నుంచి 5 కిలోల 100 గ్రాములున్న కణతిని వైద్యులు శస్త్ర చికిత్స ద్వారా తొలగించారు. కొడకండ్ల మండలం మొండ్రాయికి చెందిన ఇటుకల తబిత అనే 47 ఏళ్ల మహిళ కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆమె జనగామ పట్టణంలోని ఓ నర్సింగ్‌హోం సర్జన్ డాక్టర్ రాజమౌళి దగ్గర వైద్య పరీక్షలు చేయించుకుంది. కడుపులో కణతి ఉందని నిర్ధారించడంతో మంగళవారం ఆసుపత్రిలో సదరు మహిళకు వైద్యులు రాజమౌళి, రఘు పర్యవేక్షణలో శస్త్ర చికిత్స చేసి బయటకు తీశారు.

## ఇసుక రవాణాకు అడ్డుకట్ట


తిడుగులో రహదారి మూసివేసిన పోలీసులు

**జఫర్‌గఢ్, న్యూస్‌టుడే:** మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక తరలించకుండా ఎస్సై రామ్‌చరణ్, నాయబ్ తహసీల్దార్ ఖాసీం ఆధ్వర్యంలో ఆకేరు వాగుకు వెళ్లే ప్రధాన రహదారిని మంగళవారం మూసివేశారు. 'ఈనాడు' లో 'ఇసుక దందా వారికి మామూలే' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో ఆకేరు వాగుల నుంచి ఇసుక తరలించకుండా హెచ్చరికలు జారీ చేసి వాగుల్లోకి ట్రాక్టర్లు పోకుండా రహదారులను జేసీబీలతో మూసివేశారు. ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

## స్వచ్ఛందంగా సెలవు ప్రకటించాలి

**జనగామ అర్బన్, న్యూస్‌టుడే:** నేడు(బుధవారం), రేపు(గురువారం) జనగామ పట్టణంలో జరిగే దుర్గామాత పండగ నేపథ్యంలో పట్టణంలోని విద్యాసంస్థలు స్వచ్ఛందంగా సెలవు ప్రకటించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్‌సాయి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఐదేళ్లకోసారి వచ్చే పండగ నిర్వహణను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నందున సెలవు ఇవ్వాలని కోరారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 8008001791
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008014568

## బస్‌పాస్ కౌంటర్ మూసివేతతో ఇక్కట్లు




జనగామ బస్టాండ్ ఆవరణలో ఉన్న బస్ పాస్ కౌంటర్ కార్యాలయం మంగళవారం సమయానికి తెరవకపోవడంతో పాసులు తీసుకునే పలువురు అవసరార్థులు ఇబ్బందులు పడ్డారు. రోజూ మాదిరిగా ఉదయం 9.30 గంటలకు తెరవాల్సి ఉండగా పాసులు జారీ చేసే ఉద్యోగి రాకపోవడంతో ఉదయం 11.30 గంటలకు వేచి ఉన్నామని పలువురు విద్యార్థులు, దివ్యాంగులు, జర్నలిస్టులు, ఇతరత్రా పాసులు తీసుకునే వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను డీఎం స్వాతి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె వెంటనే సిబ్బందిని పంపించి కౌంటర్‌లో పాసులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. –జనగామ టౌన్, న్యూస్‌టుడే


చీటూరులో కూలీల కొరతతో పత్తి తీయని చేను

## పత్తి రైతులకు దుఃఖమే..!

మండలంలో 13 వేల ఎకరాల్లో పత్తి సాగు చేసిన అన్నదాతకు తీరని దుఃఖం మిగిలింది. వారం రోజులుగా బతుకమ్మ, దసరా పండగతో కూలీల కొరత ఏర్పడింది. దీనికితోడు వర్షాలు కురిసి పత్తి నేల రాలుతోంది. ఎకరాకు రూ.20 వేల పైగా పెట్టుబడి పెట్టానని ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పత్తి తీయలేదని కిష్టగూడెం రైతు శ్రీనివాస్‌రెడ్డి 'న్యూస్‌టుడే' కు వివరించారు. కూలీల కొరతతో కనుచూపు మేర పత్తి చేనులో దూదిపూలతో నిండిపోయి రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. – న్యూస్‌టుడే, లింగాలఘనపురం(స్టేషన్‌ఘన్‌పూర్)

## ఆలయంలో ఎర్రబెల్లి ప్రత్యేక పూజ

**కొడకండ్ల, న్యూస్‌టుడే:** కొడకండ్ల రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో మంగళవారం నిర్వహించిన శరత్కాల మహోత్సవాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారసత్వంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నందుకు గాను అర్చకుడు పాలకుర్తి గౌతమ్‌శర్మను ఎర్రబెల్లి అభినందించారు. కార్యక్రమంలో భారాస మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల గడువు పొడిగింపు

**జనగామ అర్బన్, న్యూస్‌టుడే:** అంబేడ్కర్ ఓవర్సీస్ విదేశీ విద్యానిధి పథకం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 29వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి డా.బి.విక్రమ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను అమెరికా, ఇంగ్లాండ్, స్విట్జర్లాండ్, కెనడా, న్యూజిలాండ్, సింగపూర్, దక్షిణకొరియా, తదితర దేశాల్లో ఉన్నత చదువులు చదివేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సాహిత్య కళాజాతకు భుజేందర్‌కు ఆహ్వానం



**పాలకుర్తి, న్యూస్‌టుడే:** పాలకుర్తి మండలం బమ్మెరకు చెందిన మాన్యపు భుజేందర్‌కు ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతకు రావాలని ప్రత్యేక ఆహ్వానం అందింది. అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తాడేపల్లిగూడెంలో ఈనెల 19, 20న జరిగే కార్యక్రమానికి ఆయనను హాజరుకావాలని వేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ ప్రధాన కార్యదర్శి పార్థసారధి మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

## సంక్షిప్తంగా

### బతుకమ్మకుంటలో ప్రమాదవశాత్తు పడిన యువతి

**జనగామ టౌన్, న్యూస్‌టుడే:** జనగామ పట్టణంలోని బతుకమ్మకుంట మైదానానికి వెళ్లిన ఓ యువతి ప్రమాదవశాత్తు జారి కుంటలో పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పట్టణంలోని చిన్నగేటు ప్రాంతానికి చెందిన గుగులోతు శివాని అనే డిగ్రీ విద్యార్థిని అక్కడికి సాయంత్రం వెళ్లింది. ఈ క్రమంలో రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ఆమె ప్రమాదవశాత్తు జారిపడింది. యువతి అరుపులు విన్న సమీపంలో ఉన్న ఇద్దరు యువకులు కాపాడారు. పట్టణ ఎస్సై శ్వేత ఆధ్వర్యంలో శివానిని జిల్లా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ప్రాణాపాయం తప్పడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు.

### అబ్దుల్ కలాం జయంతి

**జఫర్‌గఢ్:** భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం మండలంలోని కూనూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో కలాం విగ్రహానికి మండల విద్యాశాఖాధికారి పర్వేజ్, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళి అర్పించారు.

### మద్యం ప్రియులకు అడ్డాగా పాఠశాల

**రఘునాథపల్లి:** మండలంలోని గోవర్ధనగిరి ఉన్నత పాఠశాల ఆవరణ, అందులోని అంగన్వాడీ కేంద్రం మందుబాబులకు అడ్డాగా మారింది. సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల పక్కనే ఉన్న అంగన్వాడీ భవనంలోకి దర్జాగా ప్రవేశించి మద్యం తాగి సీసాలను.. వారు వెంట తెచ్చుకున్న ఆహార పదార్థాల పొట్లాలను అక్కడే పడేసి వెళ్లడంతో గమనించిన ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది ఆవేదనకు లోనయ్యారు. పోలీసులు స్పందించి మందుబాబుల ఆగడాలను అరికట్టాలని కోరారు.

### కాంగ్రెస్ జిల్లా సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్



**నర్మెట్ట:** కాంగ్రెస్ జిల్లా సహాయ కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన వలబోజు శ్రీనివాస్‌ను నియమించినట్లు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపి, నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు నాయకులకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, మండలాధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### యువజన కమిటీ ఎన్నిక

**దేవరుప్పుల రూరల్:** మండలంలోని పెద్దమడూరులో ఆదర్శ యువ మండలి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కారుపోతుల సందీప్, ఉపాధ్యక్షుడిగా సంగి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా బొనగిరి నాగరాజు, తదితర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రామ యువత, తదితరులు పాల్గొన్నారు.

### పశువులకు టీకాలు వేయించండి

**నర్మెట్ట:** మండలంలోని అన్ని గ్రామాల రైతులు వారి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ, నట్టల నివారణకు సంబంధించిన టీకాలు వేయించి పశువులు వ్యాధులకు గురికాకుండా జాగ్రత్త వహించాలని మండల పశువైద్యాధికారిణి నేహ సూచించారు. మంగళవారం మండలంలోని ఇప్పలగడ్డలో సుమారు 200 పశువులకు టీకాలు వేసి వ్యాధితో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది సుభద్ర, శివనాగరాజు, పవన్‌కుమార్ తదితరులున్నారు.

### నియోజకవర్గ కో ఆర్డినేటర్లుగా నియామకం

**జఫర్‌గఢ్:** భారాస ఎస్సీ, బీసీ సెల్ నియోజకవర్గ కోఆర్డినేటర్లను ఎంపిక చేసినట్లు మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జఫర్‌గఢ్ మాజీ ఎంపీపీ గబ్బెట బుచ్చయ్యను ఎస్సీ సెల్, జఫర్‌గఢ్‌కు చెందిన భారాస సీనియర్ నాయకుడు కొత్వాల కుమార్‌ను బీసీ సెల్ కోఆర్డినేటరుగా నియమించారు.

## మనస్తాపంతో యువకుడి మృతి


లక్ష్మయ్య (పాత చిత్రం)

**నర్మెట్ట, న్యూస్‌టుడే:** పురుగుల మందు తాగి ఓ యువకుడు సోమవారం సాయంత్రం మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై ఎన్.నగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అమ్మాపురం గ్రామ శివారు పిట్టలగూడెంకు చెందిన గుజరాతి లక్ష్మయ్య(20), ఒక అమ్మాయి రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఆమె పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం చెంది గ్రామ సమీపంలోని కెనాల్ వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తుండగా, మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి రాములు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు.

## వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక


అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్


ప్రధాన కార్యదర్శి నరేందర్‌గౌడ్

**జనగామ, న్యూస్‌టుడే:** వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా చిన్నమడూరు జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎ.ప్రవీణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా జనగామ ధర్మకంచ జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ నరేందర్‌గౌడ్ ఎన్నికైనట్లు సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## పనులు నాసిరకం.. కూలిన గద్దె



**జనగామ టౌన్, న్యూస్‌టుడే:** జనగామ పట్టణంలోని పలు ప్రధాన రహదారుల వెంబడి డివైడర్ల నిర్మాణంలో నాణ్యతా లోపంతో అక్కడక్కడ పలుమార్లు పగుళ్లు పట్టి కూలిపోతున్నాయి. మంగళవారం ఆర్టీసీ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం ఎదుట ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఏర్పాటు చేసిన గద్దె కూడా కూలిపోయింది. శిథిలాలు అక్కడే ఉండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. శిథిలాలను తొలగించాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## సంఘం భవనమే.. పాఠశాల


కురుమ సంఘం భవనంలో విద్యార్థులు

**లింగాలఘనపురం, న్యూస్‌టుడే:** మండలంలోని చీటూరు ప్రాథమిక పాఠశాలలో 52 మంది విద్యార్థులకు రెండు తరగతి గదులు ఉన్నాయి. గదుల కొరతతో పాఠశాల సమీపంలోని కురుమ సంఘం భవనంలో నాలుగో తరగతి విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. భవనంలో విద్యుత్తు సౌకర్యం లేక ఇబ్బంది పడుతూ విద్యార్థులు ఇలా వరండాలో చదువుకుంటున్నట్లు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఎంఈవో విష్ణుమూర్తి మాట్లాడుతూ.. అదనపు గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామని, నిధులు మంజూరైతే పనులు ప్రారంభించనున్నట్లు వివరించారు.

## ప్రశాంతంగా ముగిసిన కౌన్సెలింగ్


పాఠశాల కేటాయింపు ఉత్తర్వును అందజేస్తున్న కౌన్సెలింగ్ నిర్వాహకులు

**జనగామ అర్బన్, న్యూస్‌టుడే:** డీఎస్సీ విజేతలకు పోస్టింగ్ కోసం కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 197 మందికి పాఠశాలల కేటాయింపు ఉత్తర్వులను అందజేశారు. కౌన్సెలింగ్ తీరును స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ జిల్లా విద్యాశాఖాధికారి కె.రాముతో కలిసి పరిశీలించారు. పోస్టింగ్ ఉత్తర్వులు అందుకున్న నూతన ఉపాధ్యాయులకు అదనపు కలెక్టర్ అభినందనలు తెలిపారు. పోస్టింగ్ ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులు డీఈవో రాముకు మిఠాయిలు తినిపించి తమ సంతోషాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో కౌన్సెలింగ్ నిర్వాహకులు ఏపీవో శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా?..



తొర్రూరు డివిజన్ కేంద్రంలో అభివృద్ధి పనుల్లో భాగంగా పాలకేంద్రం నుంచి కూరగాయల మార్కెట్ వరకు ప్రధానరోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బస్సులు లోపలికి వచ్చే రోడ్డు పక్కన మురుగు కాలువ నిర్మాణం పూర్తయినప్పటికీ తాగునీటి పైప్‌లైను మరమ్మతుకు పెద్ద గుంతను తీసి వదిలేశారు. దీంతో ఆయా కాలనీలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పుర అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తొర్రూరు

## విడిపోని బంధానికి 22 ఏళ్లు


వీణ, వాణీలతో తల్లిదండ్రులు మురళి-నాగలక్ష్మి

**దంతాలపల్లి (మరిపెడ), న్యూస్‌టుడే:** అవిభక్త కవలలు వీణ-వాణీ 22వ వసంతంలోకి అడుగుపెట్టనున్నారు. బుధవారం 22వ జన్మదినం జరుపుకోనున్నారు. ఇద్దరు అవిభక్త కవలలను విడదీయాలని ప్రభుత్వాలను, వైద్యులను వేడుకుంటున్నా ఫలితం లేదని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుట్టినప్పటి నుంచి 13 ఏళ్ల దాకా హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రి వారికి అండగా నిలిచింది. కొంత కాలం క్రితం వీరిని హైదరాబాద్‌లోని శిశు విహార్ (స్టేట్‌హోం)కు తరలించారు.

### 22 ఏళ్లుగా అక్కడే..

మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన మారగాని మురళీ-నాగలక్ష్మి దంపతులకు నలుగురు కూతుర్లు, పెద్ద కుమార్తె బింధు, రెండో సంతానంగా వీణవాణీ అవిభక్త కవలలుగా జన్మించారు. సింధు నాలుగో సంతానం. 2003 అక్టోబర్ 16న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఇద్దరు జన్మించారు. పుట్టుకతో వీరు తలలు కలిసి జన్మించారు. నిరుపేద కుటుంబం కావడంతో రెండేళ్ల పాటు గుంటూరుకు చెందిన వైద్యుడు నాయుడమ్మ దగ్గర చికిత్స అందించారు. అనంతరం 2006లో హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరిని వేరు చేసేందుకు ముంబయిలోని బ్రీచ్‌కండీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మూడు నెలల పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి ఆపరేషన్ చేయకుండా వైద్యులు చేతులెత్తేశారు. పలు దేశాలకు చెందిన ప్రఖ్యాత వైద్యులు ఆపరేషన్ చేసేందుకు ముందుకు వచ్చిన నేటికి వారికి ఇబ్బందులు తప్పడం లేదని, శస్త్రచికిత్సకు అవసరమైన ఖర్చును ప్రభుత్వం భరించాలని కోరుతూ అప్పటి ముఖ్యమంత్రులను కలిసిన ఫలితం లేకుండా పోయిందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. పిల్లలు రోజురోజుకు నరకయాతన అనుభవిస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు వారిని వదిలి ఉండలేని పరిస్థితి. తమ పిల్లలకు శస్త్రచికిత్స చేసి వేరు చేయాలని వేడుకుంటున్నారు. వీణవాణీలు శిశువిహార్‌లో డిగ్రీ సీఏ చివరి సంవత్సరం విద్యనభ్యసిస్తున్నారు.

ప్రపంచ ఆహార దినోత్సవ శుభాకాంక్షలు
జనగామ జిల్లా పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు మరియు బచ్చన్నపేట మండల గ్రామాల ప్రజలకు, ఆహార ప్రియులకు మాకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రపంచ ఆహార దినోత్సవ శుభాకాంక్షలు..
ఆహారాన్ని వృథా చేయకుండా ఆకలి చావుల నుండి పేదలను కాపాడుదాం!

మన ఊరి దాబా
బచ్చన్నపేట
హోటల్ సాంప్రదాయ
బఫెట్ భోజనం
వెజ్ & నాన్‌వెజ్
ఇంటి భోజనం
కాంగ్రెస్ పార్టీ ఆఫీసు ఎదురుగా, సిద్దిపేట రోడ్, జనగామ.

(c) eenadu